సాక్షి
బాపట్ల

ఆదివారం । 29 । డిసెంబర్ । 2024



వెండి నంది విగ్రహం అందజేత

పిడుగురాళ్ల: పట్టణంలోని శివాలయానికి ఐదు కేజీల నంది విగ్రహాన్ని ఈవో సుబ్బారెడ్డి సమక్షంలో పెరుమాళ్ల రాజేష్, వనజలక్ష్మి దంపతులు శనివారం అందజేశారు.



ధనుర్మాస మహోత్సవాలు

తాడేపల్లి రూరల్: ఆత్మకూరులోని బాపూజీ విద్యాలయంలో ధనుర్మాస మహోత్సవాలలో 13వ పాశురాన్ని శనివారం శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న జీయర్ స్వామి వివరించారు.



ఘనంగా వెంకన్న కల్యాణం

భట్టిప్రోలు: స్థానిక వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయంలో శనివారం అలివేలు మంగ, పద్మావతి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి 25వ వార్షిక కల్యాణం ఘనంగా జరిగింది.

న్యూస్‌రీల్

31న చేబ్రోలులో జాబ్ మేళా

చేబ్రోలు: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఉపాధి కార్యాలయం, సీడాప్ సంయుక్త ఆధ్వర్యంలో చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 31న జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ వి. శ్రీదేవి శనివారం తెలిపారు. సిద్ధి వినాయక బజాజ్, అపెక్స్ సొల్యూషన్స్, ఇన్నోవాసోర్స్ కంపెనీలు హాజరవుతున్నట్లు ఆమె పేర్కొన్నారు. 10వ తరగతి, ఇంటర్, డిప్లొమా, ఐటీఐ, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన యువతీ, యువకులు పాల్గొనాలని ఆమె కోరారు.

రైలులో తప్పిపోయి తెనాలి వచ్చిన బాలిక



తెనాలి రూరల్: రైలులో తప్పిపోయి తెనాలి వచ్చిన బాలికను గుర్తించి బంధువులకు జీఆర్పీ పోలీసులు అప్పగించారు. నల్గొండ జిల్లా నకరికల్లు మండలానికి చెందిన 16 ఏళ్ల దోలూరి నిహారిక తప్పిపోయి డెల్టా ఎక్స్‌ప్రెస్‌లో తెనాలి వచ్చింది. బాలికను ప్లాట్‌ఫాంపై జీఆర్పీ పోలీసులు శుక్రవారం రాత్రి గుర్తించారు. బాలిక నుంచి వివరాలు కనుక్కొని కుటుంబసభ్యులకు సమాచారం అందించారు. బాలిక మేనమామ వెంకటరెడ్డి, బంధువులు శనివారం తెనాలి రాగా వారికి అప్పగించారు.

పోలీసుల అదుపు నుంచి నిందితుడి పరారీ

తెనాలి రూరల్: చోరీ కేసులో నిందితుడు పరారయ్యాడు. విశ్వసనీయ సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. పట్టణ ముత్తెంశెట్టిపాలెం ఆంధ్రరత్న రోడ్డులో నిర్మాణంలో ఉన్న భవనం కోసం యజమాని పెద్ద మొత్తంలో వైర్లు, సామగ్రి తెప్పించి పెట్టాడు. ఇవి చోరీకి గురవడంతో వన్‌టౌన్ పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు దర్యాప్తులో భాగంగా నిందితుడిని రేపల్లెకు చెందిన వ్యక్తిగా గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. చోరీ చేసిన వైర్లను రేపల్లెలోని దుకాణంలో విక్రయించానని చెప్పడంతో రికవరీ కోసం కానిస్టేబుళ్లు అక్కడకు శుక్రవారం తీసుకెళ్లారు. ఓ దుకాణాన్ని చూపించి అక్కడే విక్రయించానని చెప్పి లోపలికి వెళ్లి పోలీసులకు చిక్కకుండా పరారయ్యాడు. చేసేది లేక దుకాణ యజమానిని పోలీసులు తమ వెంట తీసుకువచ్చి విచారిస్తున్నట్టు సమాచారం.

వేళంగణి వేడుకలకు ప్రత్యేక రైలు

లక్ష్మీపురం: నూతన సంవత్సర వేడుకలు సందర్భంగా వేళంగణి వేడుకలకు ప్రత్యేక రైలును కేటాయించినట్లు డివిజన్ సీనియర్ డీసీఎం డాక్టర్ ప్రదీప్‌కుమార్ శనివారం రాత్రి తెలిపారు. రైలు నంబరు (07125) సికింద్రాబాద్ – వేళంగణి రైలు ఈనెల 30న సికింద్రాబాద్ నుంచి రాత్రి 8 గంటలకు బయల్దేరి మరుసటి రోజు రాత్రి 7.30 గంటలకు వేళంగణి స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు. (07126) వేళంగణి – సికింద్రాబాద్ రైలు జనవరి 1న వేళంగణిలో రాత్రి 10 గంటలకు బయల్దేరి మరుసటి రోజు రాత్రి 10.40 గంటలకు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకుంటుందని పేర్కొన్నారు. ప్రత్యేక రైలు నల్గొండ, మిర్యాలగూడ, నడికుడి, సత్తెనపల్లి, గుంటూరు, తెనాలి, బాపట్ల, చీరాల, ఒంగోలు, కావలి, నెల్లూరు, గూడూరు, రేణిగుంట, మాల్‌పాకం, కాట్పాడి, వేలూరు, తిరువణ్ణామలై, విల్లుపురం మీదుగా నాగపట్నం స్టేషన్‌కు చేరుకుంటుందని తెలిపారు.

బంగారం షాపులో చోరీ



పట్నంబజారు: బంగారం దుకాణానికి చెవిటి, మూగ వ్యక్తిలా వచ్చి ఆభరణాలు దోచుకుని పోయిన సంఘటనపై కేసు నమోదైంది. లాలాపేట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్నంబజారులో రియాజుద్దీన్ నిజాం జ్యూయలరీ షాపు నిర్వహిస్తున్నాడు. శనివారం గుర్తు తెలియని వ్యక్తి తాను మూగ, చెవిటి అని సర్టిఫికెట్ తీసుకొచ్చి, ఆర్థిక సాయం కావాలంటూ షాపు నిర్వాహకులను అడిగాడు. ఈ సమయంలో తన వద్ద ఉన్న టవల్‌ను టేబుల్‌పై ఉన్న బంగారు ఆభరణాల బాక్సుపై వేసి చాకచక్యంగా వెంట తీసుకుని వెళ్లాడు. 208 గ్రాముల బంగారం విలువ రూ. 15 లక్షలు ఉంటుంది. లాలాపేట పోలీసులు, సీసీఎస్ విభాగం సంఘటనా స్థలానికి చేరుకుని సీసీ కెమెరాల పుటేజీలు పరిశీలించారు. నిందితుడి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

మద్దతు మమ!

కూటమి ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి రైతులకు కష్టాలు తప్పడం లేదు. పెట్టుబడి సాయం అందకపోవడం నుంచి మద్దతు ధర వరకు వారికి అవస్థలే. వరుసగా వాయుగుండాలు వెంటాడినా సబ్సిడీపై విత్తనాలు, ఎరువులు అందలేదు. అప్పులు చేసి సాగు చేసిన రైతులు చివరికి ధాన్యం విక్రయానికి కూడా పాట్లు పడుతున్నారు. పాలకులు కనీసం పట్టించుకోవడం లేదు.



బాపట్లలోని సీతారామాంజనేయ ఇండస్ట్రీస్ వద్ద రోజుల తరబడి నిలిపి ఉంచిన ధాన్యం ట్రాక్టర్లు

అన్నదాతల వేదన పట్టని కూటమి పాలకులు

- నిబంధనలు పాటించని మిల్లర్లు
- ధాన్యం విక్రయానికి రైతుల పడిగాపులు
- రోజుల తరబడి మిల్లుల వద్దే లోడు ట్రాక్టర్లు
- తేమ శాతం సాకుగా చూపుతూ దోపిడీ
- అడుగడుగునా కొరవడిన ప్రభుత్వ పర్యవేక్షణ
- దళారుల దందాతో బస్తాపై రూ. 300కుపైగా అన్నదాతకు నష్టం
- కూటమి సర్కార్‌పై రగిలిపోతున్న రైతులు

బాపట్ల టౌన్ : మద్దతు ధర కోసం గతంలో రైతులు ధర్నాలు చేసి సాక్షాత్తు జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రాలు అందించినా ఫలితం మాత్రం దక్కలేదు. మిల్లర్లు, దళారులు కలిసి రైతును నట్టేట ముంచుతున్నారు. గతేడాది మిచాంగ్ తుపాను కారణంగా బాపట్ల జిల్లాలో పంటలు దెబ్బతిన్నాయి. విషయం తెలుసుకున్న అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి స్వయంగా వచ్చి అన్నదాతలను కలిసి కష్టాలను తెలుసుకున్నారు. ధాన్యం రంగు మారినా, తడిసినా రైతుకు మంచి చేయాలని తలంచారు. తేమ 27 శాతం వచ్చినా ధాన్యం కొనుగోలు చేశారు. ఇప్పుడు కూటమి సర్కారు వచ్చాక మాత్రం 17కు మించితే నిర్దాక్షిణ్యంగా వెనక్కి పంపుతున్నారు. ఈ ఏడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో వాయుగుండాలు, అల్పపీడనాలతో రైతులు అతలాకుతలమైనా అదే నిర్లక్ష్యం. మిల్లుల వద్దకు వచ్చిన ధాన్యం ట్రాక్టర్లను వెనక్కి పంపిస్తున్నా పాలకులు పట్టించుకోవడం లేదు.

రెండు రోజుల్లోనే తేమలో తేడా...

పిట్టలవానిపాలెం మండలం, మంతెనవారిపాలెంలో ఉంటున్న కీర్తి శ్రీనివాసరావు ట్రాక్టర్ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నారు. ఈ నెల 24న అదే గ్రామానికి చెందిన రైతు గూడవర్తి వెంకటసుబ్బరాజు ధాన్యాన్ని మిల్లుకు తోలేందుకు బాడుగకు ఆయన వెళ్లారు. 24న 100 బస్తాల ధాన్యం పట్టణంలోని అయ్యప్ప ట్రేడర్స్ (ఉప్పరపాలెం) రైస్ మిల్లుకు చేర్చారు. తేమ 5 శాతం అధికంగా ఉందని చెప్పిన బస్తాకు రూ. 116 తగ్గించారు. 25న 200 బస్తాలు తీసుకెళితే తేమ 27 శాతంగా వచ్చింది. ఒక్కరోజులోనే తేమ పెరగడంపై ప్రశ్నిస్తే మిల్లరు నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. ప్రాధేయపడినా ధాన్యం తీసుకోలేదు. ధాన్యం తడవకుండా ట్రాక్టర్ డ్రైవర్ టార్పాలిన్ పట్టలు కొని లోడుపై కప్పి రాత్రంతా అక్కడే ఉన్నారు. మిల్లర్లు ససేమిరా అనడంతో 26న గ్రామానికి వెనక్కి తీసుకెళ్లారు.

తేమ లేకున్నా ధర తగ్గింపు



3 ఎకరాలలో 15 రోజుల క్రితం హార్వెస్టింగ్ చేయించాను. 95 బస్తాల ధాన్యాన్ని 15 రోజులుగా ఎండబెట్టాను. రైతు సేవా కేంద్రంలో 25న తేమ శాతం పరీక్ష చేయించాను. 19 ఉన్నట్లు వచ్చింది. రెండు రోజులు ఎండబెట్టి 27న డిపోలోని రైస్ మిల్లుకు తీసుకొచ్చా. పరీక్షలు చేసి 22 శాతం తేమ ఉందన్నారు. 17 దాటినప్పటి నుంచి పాయింట్ల ఆధారంగా ధాన్యం తగ్గించి తీసుకుంటామని చెబుతున్నారు. గ్రామాల్లోని ఆర్‌ఎస్‌కే సిబ్బంది పరీక్షలు చేసిన రసీదు ఇస్తే బాధలు ఉండవు.

– నూకతోటి తిరుపతయ్య, కొండుబోట్లవారి పాలెం



కొనేవారు లేక కల్లంలోనే ఉంచిన ధాన్యం

మూడు రోజులు ఇక్కడే ఉన్నా



మాది పిట్టలవానిపాలెం మండలం, పిట్టువారిపాలెం. ఈ నెల 20న ధాన్యం లోడుతో డిపోలోని రైస్ మిల్లుకు వెళ్లా. టైం పడుతుందన్నారు. రాత్రంతా బాపట్లలోనే ఉన్నాను. తెల్లారాక దించుతారని ఎదురుచూసినా దించలేదు. 23న ఉదయం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని సూర్య రైస్ ట్రేడర్స్‌లో ధాన్యం దించారు. ట్రాక్టర్ వదిలి వెళ్లలేక మూడు రోజులుగా బాపట్లలోనే ఉన్నా. ధాన్యం బాడుగకు రావాలంటేనే భయమేస్తోంది. పదేళ్లుగా ట్రాక్టర్ తోలుతున్నా ఈ పరిస్థితి ఎన్నడూ లేదు.

– గంజరబోయిన గుడారంకయ్య, పిట్టువారిపాలెం

పట్టించుకోని ప్రభుత్వం



ఐదు ఎకరాలలో ఎంటీయూ 1262 రకం సాగు చేశాను. హార్వెస్టింగ్ చేయించి 10 రోజులు అయ్యింది. మిల్లుకు తీసుకెళితే తేమ ఎక్కువగా ఉందని చెబుతున్నారు. పొలాల్లో పరిశీలించిన అధికారులు బాగానే ఉందని చెబుతున్నారు. మిల్లుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. బస్తా రూ.1,400 చొప్పున ఇస్తానని దళారులకు చెప్పా. ప్రభుత్వం పట్టించుకోవడం లేదు.

– పాగోలు సీతారాంబాబు, గులాంహుస్సేన్ తోట

కల్లంలోనే ధాన్యం



మరుప్రోలు వారి పాలెం పరిధిలో 7 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. గతేడాది ధాన్యం హార్వెస్టింగ్ చేసిన రోజే బస్తా రూ. 1,650 చొప్పున కొనుగోలు చేశారు. ఇప్పుడు 13న హార్వెస్టింగ్ చేయించాను. ధాన్యం కల్లంలో ఉంది. తేమ కూడా లేదు. ఎవరూ కొనడం లేదు.

– గవిని సాంబయ్య, కొత్త మద్దిబోయినవారి పాలెం

బాలల భవిష్యత్తుకు పునాది వేయాలి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు

చీరాల అర్బన్: బాలల భవిష్యత్తుకు ఉపాధ్యాయులు పునాదులు వేసి మార్గదర్శకులుగా ఉండాలని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యురాలు బత్తుల పద్మావతి అన్నారు. శనివారం ఆమె చీరాలలోని ఎంపీపీ స్కూల్‌ను సందర్శించారు. రికార్డులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. మెనూ పరిశీలించారు. హయ్యర్‌పేటలోని అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి గుడ్లు, ఇతర స్టాకుపై ఆరా తీశారు. తర్వాత రోటరీ క్లబ్‌లో ఆర్‌ఐపీ, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్టుమెంట్, డీపీఓ, సీడీపీఓలు, సూపర్‌వైజర్లు, డీసీపీయూ తదితర డిపార్టుమెంట్‌ల వారితో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో బాల్య వివాహాలు, పోక్సో కేసులు పూర్తి స్థాయిలో తగ్గించాలన్నారు. అన్ని శాఖలకు సహకారం అందించాలన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రొబిషన్ ఆఫీసర్ సౌందర్య, మహిళ, శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్టు డైరెక్టర్ ఉమ, బాలల సంక్షేమ కమిటి సభ్యురాలు నీలిమ, ఎస్పైస్ రాజ్యలక్ష్మి, చైల్డ్ కేర్ ఇనిస్టిట్యూషన్స్ ఇన్‌చార్జులు, మేనేజ్‌మెంట్, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సిబ్బంది, సఖి సిబ్బంది, జిల్లాలోని ఐసీడీఎస్ సీడీపీఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సంతోషకర సమాజంతోనే ఆనంద జీవితం

ఏఎన్‌యూ : సమాజం సంతోషంగా ఉంటే మనం కూడా ఆనందమయ జీవితాన్ని గడుపుతామని సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్ వి.రమణ అభిప్రాయపడ్డారు. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని పూర్వ విద్యార్థుల సంఘ సమావేశం శనివారం యూనివర్సిటీ డైక్‌మన్ ఆడిటోరియంలో నిర్వహించారు. సమావేశానికి సంఘం డైరెక్టర్ ఆచార్య జి.వి.ఎస్.ఆర్. ఆంజనేయులు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జస్టిస్ ఎన్.వి. రమణ మాట్లాడుతూ సమాజంలో అల్లర్లు, గొడవలు, కొట్లాటలు ఉంటే సుఖమైన జీవితాన్ని గడపలేమని తెలిపారు.

పోల్‌వాల్ట్ దూకుతున్న శ్రీనివాసులురెడ్డి (60 సంవత్సరాలు, బాపట్ల)



ఉరుకులెత్తిన ఉత్సాహం

గుంటూరు వెస్ట్: స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో ఆరోఏపీ మాస్టర్స్ అథ్లెటిక్ చాంపియన్ షిప్–2024 పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు గల్లా మాధవి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్రీడా సాధనకు వయస్సుతో సంబంధం లేదని తెలిపారు. ఎనిమిది పదుల వస్సులోనూ పోటీల్లో పాల్గొనడం నిజంగా గొప్పదనమని కొనియాడారు. అవకాశం ఉన్నంత వరకు ప్రతిరోజూ వ్యాయామం, యోగా, క్రీడా సాధన గానీ చేయాలని సూచించారు. ఏపీ మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు షేక్ లాల్ వజీర్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా సుమారు 400 మంది స్త్రీ, పురుష వెటరన్ అథ్లెటిక్స్ వివిధ విభాగాల్లో పాల్గొన్నారని తెలిపారు. ఆదివారంతో ఈ పోటీలు ముగుస్తాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్‌సీసీ విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్, జ్యోతి ప్రజ్వలన నిర్వహించారు.



శివప్రసాద్ (75 సంవత్సరాలు, గుంటూరు)



శ్రీనివాసులురెడ్డి (60 సంవత్సరాలు, బాపట్ల)



ముత్నం లక్ష్మి (85 సంవత్సరాలు, విశాఖ)

ప్రతిభలో మేటి.. ఉత్సాహంగా పోటీ

- అట్టహాసంగా పల్నాడు బాలోత్సవాలు ప్రారంభం
- ముఖ్య అతిథులుగా ఎంపీ లావు, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, ఎమ్మెల్యే చదలవాడ హాజరు
- పలు అంశాలలో తలపడిన విద్యార్థులు



సాంస్కృతిక పోటీల్లో విద్యార్థినులు

నరసరావుపేట: విద్యార్థులలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు పల్నాడు బాలోత్సవం లాంటి కార్యక్రమాలు దోహదపడతాయని ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పేర్కొన్నారు. శనివారం పల్నాడు రోడ్డులోని పీఎన్‌సీ అండ్ కేఆర్ కళాశాల ప్రాంగణంలో పల్నాడు బాలోత్సవం రెండవ పిల్లల పండుగ అట్టహాసంగా ప్రారంభమైంది. భారీ సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులకు లఘు నాటికలు, గ్రూపు శాస్త్రీయ నృత్యం, పాటలు, వ్యాసరచన, పోస్టర్ ప్రజెంటేషన్, కోలాటం, హ్యాండ్ రైటింగ్, సైన్స్ ప్రయోగాలు, కథా రచన, కథా విశ్లేషణ, మ్యాప్, ఏకపాత్రాభినయం, మైమ్, మ్యూజిక్, మిమిక్రీ, డిబేట్, క్విజ్, అంతర్జాలంలో అన్వేషణ పోటీలు నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథులుగా ఎంపీ లావు, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు హాజరయ్యారు. బాలోత్సవం కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సభలో ఎంపీ లావు మాట్లాడుతూ ఈ కార్యక్రమాల ద్వారా విద్యార్థులలో స్నేహభావం, నాయకత్వ లక్షణాలు పెరుగుతాయని చెప్పారు. పిల్లలు అన్ని విషయాలు పంచుకునేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వ్యవహరించాలని సూచించారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ... ఆధునిక యుగంలో చిన్నారులు కంప్యూటర్, టీవీ, సెల్ ఫోన్లకు ఆకర్షితులై ఆటపాటలు, ఇతర కార్యక్రమాలు మర్చిపోతున్నారని తెలిపారు. ర్యాంకులే ముఖ్యం అన్నట్లు కాకుండా సాంస్కృతిక కార్యక్రమాలలో కూడా పిల్లల భాగస్వాములు కావాలని కోరారు. విజయవాడ మాకినేని బసవ పున్నయ్య విజ్ఞాన కేంద్రం ప్రధాన కార్యదర్శి పిన్నమనేని మురళీకృష్ణ , బాలోత్సవాల కార్యదర్శి కట్టా కోటేశ్వరరావు, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు, టీడీపీ నాయకులు కపలవాయి విజయకుమార్, నల్లపాటి రాము, బాలోత్సవాల గౌరవ అధ్యక్షుడు ఎమ్మెస్ ఆర్కే ప్రసాద్, అధ్యక్షుడు సీహెచ్ రాజారెడ్డి, కోశాధికారి కోయా రామారావు, కమిటీ సభ్యులు ఎ. భాగేశ్వరిదేవి, అనుముల లక్ష్మీశ్వరరెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ లావు, వేదికపై ఎమ్మెల్సీ లక్ష్మణరావు తదితరులు

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శనివారం 1616 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 100, తూర్పు కెనాల్‌కు 105, నిజాంపట్నం కాలువకు 72, కొమ్మమూరు కాలువకు 1343 క్యూసెక్కులు విడుదల చేశారు.

ఏఐఐఎంఎస్ ప్రవేశ పరీక్షలో మనోడి ప్రతిభ



గాదె మను శశిధర్‌రెడ్డి

చేబ్రోలు: ఢిల్లీ ఏఐఐఎంఎస్ (ఆల్ ఇండియా ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్స్) నిర్వహించిన సూపర్ స్పెషాల్టీ ప్రవేశ పరీక్షలో జాయింట్ రీప్లేస్‌మెంట్ అండ్ రీ కన్‌స్ట్రక్షన్ విభాగంలో చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలేనికి చెందిన గాదె మను శశిధర్‌రెడ్డి రెండో ర్యాంక్ సాధించినట్లు కుటుంబ సభ్యులు శనివారం తెలిపారు. ఇండియాలోని నాలుగు ఎయిమ్స్ కళాశాలలు అయిన రుషికేశ్, రాయపూర్, బోపాల్, బెటానియాల్లో ఒక్కొక్క సీటు చొప్పున నాలుగు మాత్రమే ఉన్నాయి. రెండో ర్యాంక్ సాధించిన మను శశిధర్‌రెడ్డి ఈ నాలుగు కళాశాలల్లో ఒకదానిలో 2025 జనవరిలో ప్రవేశం పొందనున్నాడు. చేబ్రోలులోని కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన కేసీ హైస్కూల్ హెచ్‌ఎం త్రిపుర సుందర రెడ్డి, లక్ష్మీ నాగేంద్రల కుమారుడు శశిధర్‌రెడ్డి చిన్నతనం నుంచి చదువులో రాణించి నేడు జాతీయ స్థాయిలో జరిగిన ప్రవేశ పరీక్షలోను రెండో ర్యాంక్ సాధించాడు. స్వాతంత్ర సమరయోధుడు గాదె సైరా చిన్నప్పరెడ్డి వంశంలోని 5వ తరానికి చెందిన వారు. పదో తరగతిలో 600 మార్కులకు గాను 584మార్కులు సాధించాడు. తల్లిదండ్రుల ఆకాంక్షల మేరకు ఇంటర్‌లో బైపీసీలో విద్యనభ్యసించి 974మార్కులు సాధించి రాష్ట్ర స్థాయిలో 12వ ర్యాంక్ సాధించాడు. ఎంసెట్‌లో మొదటి ప్రయత్నంలోనే 553వ ర్యాంక్ పొంది గుంటూరు మెడికల్ కాలేజీలో సీటు సాధించాడు. 2018–19లో ఎంబీబీఎస్ పట్టా అందుకున్నాడు. హైదరాబాద్ నిమ్స్‌లో ఉన్న తొమ్మిది సీట్లలో సెంట్రల్ కోటాలో మొదటి సీటు ఎంఎస్ ఆర్థోపెడిక్‌లో చేరాడు. 2023లో ఎంఎస్ ఆర్థోతో పాటు డీఎన్‌బీ ఆర్థోను పూర్తి చేశాడు.2023 ఫిబ్రవరిలో జరిగిన తెలంగాణా స్టేట్ ఆర్థోపెడిక్ సర్జన్స్ కాన్ఫరెన్స్‌లో పేపర్ ప్రజెంటేషన్‌లో గోల్డ్‌మెడల్, క్విజ్‌లో ఫస్ట్ ప్రైజ్ సాధించాడు.

క్లుప్తంగా

పాఠశాలల అభివృద్ధికి కృషి

– రాష్ట్ర పరిశీలకులు హేమారావు



బాపట్ల: పాఠశాలల అభివృద్ధిలో స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీల పాత్ర కీలకంగా ఉండాలని సమగ్ర శిక్ష రాష్ట్ర పరిశీలకుడు హేమారావు సూచించారు. బాపట్లలోని డీఈఓ కార్యాలయంలో ఒక రోజు శిక్షణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. హేమారావు మాట్లాడుతూ పాఠశాలల అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకంగా ఉండాలని కోరారు. శిక్షణ పొందిన ఉపాధ్యాయులు మండల స్థాయి కమిటీలకు కూడా శిక్షణ ఇవ్వాలని చెప్పారు. ఎస్‌ఎంసీ సభ్యులు, ఉపాధ్యాయులు కలిసి అభివృద్ధికి కృషి చేయాలన్నారు. రిసోర్స్‌పర్సన్ పాత్ర కీలకంగా ఉంటుందని వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్.పురుషోత్తం మాట్లాడుతూ ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ప్రతి ఒక్కరూ పని చేయాలని కోరారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష సీఎంఓ శ్రీనివాసులరెడ్డి పాల్గొన్నారు.

బ్రిడ్జిపై నుంచి దూకి వివాహిత ఆత్మహత్య

అద్దంకి: బ్రిడ్జిపై నుంచి గుండ్లకమ్మ నదిలోకి దూకి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని తిమ్మాయపాలేనికి చెందిన కోల్లూరి అంజయ్య, హనుమాయమ్మ(50) భార్యాభర్తలు. పండ్ల వ్యాపారం చేస్తూ జీవనం సాగిస్తుంటారు. వీరికి ఇరువురు కుమారులు, ఓ కుమార్తె ఉన్నారు. ప్రతి రోజూ ఉదయాన్నే వివిధ గ్రామాలకు వెళ్లి పండ్లు అమ్ముకుని రాత్రికి ఇంటికి వస్తుంటారు. ఇది ఇలాఉంటే శనివారం రాత్రి అంజయ్య భార్య హనుమయమ్మ బ్రిడ్జిపై నుంచి గుండ్లకమ్మ నదిలోకి దూకింది. అటు వైపు పోతున్న గ్రామస్తులు బ్రిడ్జిపైన ఒక సెల్ ఫోన్ పెట్టి ఉండటాన్ని గమనించి హనుయమ్మ కుమార్తె ఫోన్ మాట్లాడగా.. ఆ ఫోన్ తమ తల్లిదే ఆ ఫోన్ చెప్పటంతో బంధువులంతా అక్కడికి చేరుకున్నారు. పోలీసులు మృతదేహం కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అయితే భార్యాభర్తల ఇరువురి మధ్య కలహాలే వివాహిత ఆత్మహత్యకు కారణం అని బంధువులు భావిస్తున్నారు.

దుకాణాల్లోకి దూసుకుపోయిన లారీ



మేదరమెట్ల: లారీ డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో అదుపు తప్పిన లారీ రోడ్డు పక్కన ఉన్న బడ్డీ కొట్టుల్లోకి దూసుకుపోయిన ఘటన శుక్రవారం అర్ధరాత్రి తిమ్మనపాలెం వద్ద చోటుచేసుకుంది. ఒంగోలు వైపు నుంచి గుంటూరు వైపు వెళుతున్న లారీ శుక్రవారం అర్ధరాత్రి దాటాక కొరిశపాడు మండలం తిమ్మనపాలెం గ్రామం వద్దకు రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకున్నాడు. దీంతో లారీ అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న దుకాణాల్లోకి దూసుకుపోవడంతో పలు వస్తువులు ధ్వంసం అయ్యాయి. అదృష్టవశాత్తు ఎవరికీ ఎలాంటి గాయాలు కాలేదు. డ్రైవర్ వెంకటేశ్వర్లుకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న హైవే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని గాయపడిన డ్రైవర్‌ను 108 అంబులెన్స్‌లో వైద్యశాలకు తరలించారు. మేదరమెట్ల పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

నాట్య మయూరం..జీవనం భారం

- సంగీతంలో సరస్వతి... నాట్యంలో మయూరి
- విధి వెంటాడి భర్త, ముగ్గురు కుమారుల మృతి
- మూడేళ్ల కిందటి వరకు విద్యార్థులకు సంగీత, నృత్యాల్లో శిక్షణ
- బాత్రూమ్‌లో జారిపడటంతో చచ్చుబడిన కాళ్లు
- దివ్యాంగుడైన నాలుగో కుమారుడిపై ఆధారపడి జీవనం



సంగీతాలాపన చేస్తున్న విజయలక్ష్మి(ఫైల్)

చిలకలూరిపేట: ఆమె సంగీతంలో సరస్వతి... నాట్యంలో మయూరి...థిల్లానా, భామాకలాపం, కృష్ణశబ్దం, జతిస్వరం, తరంగం వంటి నాట్యరీతుల్లో దిట్ట. అన్నమయ్య కీర్తనలు, త్యాగరాయకృతులు, జానపదుల్లో ఆరితేరిన స్వరఝరి. సంగీత, నృత్య శిక్షకురాలిగా ఎందరో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దిన ఘనాపాటి. పగబట్టినట్లు విధి వెంటాడితే.. నెమలి నాట్యాలు నేర్పిన పాదాలు నిస్తేజంగా మారాయి. సుమధుర స్వరాలు పలికిన గొంతుక నిర్వేదం దాల్చింది. జీవితంలో ఒకే ఒక్క తోడైన బధిర మూగ వాడైన చిన్న కుమారుడు బాసటగా, భారంగా జీవితం వెళ్లదీస్తోంది.

బాల్యం నుంచే కళలపై ఆసక్తి...

పల్నాడు జిల్లా చిలకలూరిపేట పట్టణంలోని పండరీపురం మూడోలైనులో ఓ చిన్న అద్దె ఇంట్లో నివాసం ఉండే ఏడుపదుల ప్రాయం కలిగిన బెల్లంకొండ విజయలక్ష్మి స్వస్థలం మచిలీపట్నం. తండ్రి వానపాముల సత్యనారాయణకు భారతీయ సాంప్రదాయ కళలపై ఆసక్తి మెండు. స్వతహాగా కళాకారుడు. తండ్రి స్ఫూర్తితో పదేళ్ల ప్రాయం నుంచే ప్రముఖ సినీ రచయిత బుర్రా సాయిమాధవ్ తండ్రి బుర్రా సుబ్రమణ్యశాస్త్రి వద్ద గుంటూరులో కూచిపూడి నృత్యంలో శిక్షణ పొందారు. కావలికి చెందిన బెల్లంకొండ శివప్రసాద్‌తో వివాహం అనంతరం ఒంగోలులో ప్రముఖ శాస్త్రీయ సంగీత విద్వాంసుడు ఎంఎస్ బాలసుబ్రమణ్యశర్మ వద్ద శాస్త్రీయ సంగీతంలో శిక్షణ పొందటంతో పాటు సంగీతంలో డిప్లమో చేశారు. ఒంగోలులోని కృష్ణ మెమోరియల్ స్కూల్, కావలిలోని సెయింట్ ఆన్స్ స్కూల్ తదితర పాఠశాలలతో పాటు సాయంత్రం వేళల్లో ఇంటివద్ద విద్యార్థులకు సంగీత, నృత్య రీతుల్లో శిక్షణ ఇచ్చి తీర్చిదిద్దేవారు. ఈ నేపథ్యంలో ఆమెకు ఎందరో ప్రముఖుల నుంచి ప్రశంసలు, అవార్డులు, రివార్డులు దక్కాయి.

వెంటాడిన విధి...

భర్త, నలుగురు సంతానం, సంగీతం, నృత్యం మేళవింపుగా సాగిపోతున్న ఆమె జీవితంపై కాలం కక్ష కట్టింది. ఒకటి తర్వాత ఒకటిగా విషాద సంఘటనలు ఆమె జీవితంలో కల్లోలం సృష్టించాయి. 28 సంవత్సరాల కిందట భర్త శివప్రసాద్ అనారోగ్యంతో మృతి చెందాడు. ఇంటర్ చదువుతున్న కుమారుడు కరుణాకర్ క్యాన్సర్ బారిన పడి అశువులు బాసాడు. కుటుంబానికి అండగా ఉంటాడనుకున్న రెవెన్యూ ఉద్యోగి అయిన రెండో కుమారుడు రవిశంకర్ సైతం కాలేయ సంబంధిత వ్యాధితో మృత్యువాత పడ్డాడు. దీంతో 16 ఏళ్ల కిందట చిలకలూరిపేట చేరుకొని డ్యాన్స్ మాస్టర్ అయిన మూడో కుమారుడు రాజా, పుట్టుకతో మూగ, చెవిటివాడైన నాల్గో కుమారుడు చక్రధర్‌తో కలసి నివాసం ఉంటున్నారు. అయినా జాలి లేని విధికి వీరిపై కరుణ కలుగలేదు. ఈ ఏడాది ఏప్రిల్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో మూడో కుమారుడు రాజా సైతం కన్ను మూశాడు

వరించిన అవార్డుల్లో కొన్ని..



తుర్లపాటి కుటుంబరావు నుంచి అవార్డు స్వీకరిస్తూ..

నృత్య, సంగీత ఉపాధ్యాయురాలిగా ఆమె సేవలకు మెచ్చి పలు సంస్థలు ఆమెకు పలు అవార్డులతో సన్మానించాయి. 1993లో కావలి జన విజ్ఞాన వేదిక అవార్డు, 1994లో ఒంగోలు నెహ్రూ యువకేంద్రం అవార్డు, 1998లో నెల్లూరు విద్యాశాఖ ప్రశంసాపత్రం, 2006లో రిపబ్లిక్ డే సందర్భంగా అప్పటి జిల్లా కలెక్టర్ ఉదయలక్ష్మి చేతుల మీదుగా అవార్డు, 2014లో గుంటూరుకు చెందిన భారత వికాస సమితి పురస్కారం, 2018లో గుంటూరు స్వరనిధి సంస్థ పురస్కారం ఇలా ఎన్నో అవార్డులు, రివార్డులు వరించాయి.

మూడేళ్లుగా మంచానికే పరిమితం...



దివ్యాంగుడైన కుమారుడు చక్రధర్‌తో విజయలక్ష్మి

దివ్యాంగుడైన నాల్గో కుమారుడితో ఒక చిన్న అద్దె ఇంట్లో ఉంటూ మూడేళ్ల కిందటి వరకు విద్యార్థులకు సంగీత పాఠాలు బోధిస్తూ వచ్చారు. అయితే అప్పటివరకు ఆమె జీవితంలో జరిగిన విషాదం చాలదన్నట్లు మూడేళ్ల కిందట బాత్రూమ్‌లో జారి పడటంతో రెండు కాళ్లు చచ్చుబడి పోయాయి. పుట్టు మూగ, చెవిటి వాడైన నాల్గో కుమారుడు చక్రధర్ స్థానికంగా ఉన్న మున్సిపల్ హైస్కూల్‌లో అవుట్ సోర్సింగ్ విధానంలో డ్రాయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేస్తూ దాచుకున్న డబ్బు సైతం తల్లి వైద్యానికి ఖర్చు చేసినా ఉపయోగం లేకుండా పోయింది. దివ్యాంగుడైనప్పటికీ మంచి చిత్రకారుడు కావడంతో తాత్కాలిక ప్రాతిపదికన డ్రాయింగ్ ఇన్‌స్ట్రక్టర్‌గా పని చేస్తూ అమ్మకు బాసటగా, అండగా నిలుస్తున్నాడు. ఒకరికి ఒకరు తోడుగా జీవిస్తున్న ఈ విధి వంచితులకు సమాజం బాసటగా నిలిచి ఆత్మీయత పంచాల్సిన బాధ్యత ఎంతైనా ఉంది.

ట్రాఫిక్ నిబంధనలు పాటించడం తప్పనిసరి

జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

నగరంపాలెం: నగరంలో ఆటోడ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్లే సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ అన్నారు. పోలీస్ కల్యాణ మండపంలో శనివారం గుంటూరు నగరంలోని ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమ నిబంధనలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ ఒకరి మధ్య ఒకరికి సమన్వయం లేకపోవడం, ఆటోలు నిలుపుదల ప్రదేశాలు లేకపోవడంతో ఇష్టానుసారంగా రహదారులపై నిలుపుదల చేస్తున్నారని అన్నారు. దీంతో ప్రయాణికులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, తద్వారా ట్రాఫిక్ సమస్యలకు ప్రధాన కారణమవుతున్నాయని పేర్కొన్నారు. ఆటోడ్రైవర్ల ముసుగులో కొందరు అసాంఘిక చర్యలకు పాల్పడుతున్నారని, వారి వల్ల మిగతా ఆటోడ్రైవర్లకు చెడు పేరు వస్తోందన్నారు. ఆటోలు అద్దెకిచ్చే వేళల్లో పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలని చెప్పారు. త్వరలో సాంకేతిక పరిజ్ఞానంతో ఆటోడ్రైవర్ల వివరాలను క్యూర్ కోడ్ చిరునామాతో ఉన్న స్టిక్కర్లు అతికిస్తామని అన్నారు. గుంటూరు పశ్చిమ, తూర్పు ట్రాఫిక్ పీఎస్ పరిధిలోని ఆటోలకు ప్రత్యేకమైన నంబర్ కేటాయిస్తామని తెలిపారు. జిల్లా ఏఎస్పీ (క్రైం) కె.సుప్రజ మాట్లాడుతూ ఆటోడ్రైవర్ల ముసుగులో కొందరు మహిళలను ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని అన్నారు. ఇటువంటి చర్యలకు పాల్పడవద్దని సూచించారు. అటువంటి వ్యక్తులు ఉన్నట్‌లైతే పోలీసులకు సమాచారం అందించాలని చెప్పారు. మహిళా పీఎస్ డీఎస్పీ సుబ్బారావు, సీఐలు ఎ.అశోక్‌కుమార్ (తూర్పు), సింగయ్య (పశ్చిమ), ఎస్‌ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

జూదరుల అరెస్ట్

కర్లపాలెం: చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై చట్టప్రకారం కేసులు నమోదు చేస్తామని కర్లపాలెం ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు. కర్లపాలెం మండలంలోని గణపవరం గ్రామ సమీపంలో పేకాటాడుతున్న ఆరుగురిని అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వీరి నుంచి రూ.3,290 స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

జనవరి 15న ఎడ్ల పందేలు

పర్చూరు(చినగంజాం): మండలంలోని చెరుకూరులో జనవరి 15వ తేదీన ఇక్షపురి ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో మైసూరు జాతి ఎడ్ల పందేలు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు బొంతగొర్ల వీరాస్వామి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. విజేతలకు రూ.15,116, రూ.10,116, రూ.8,116, రూ.5 వేలు వరసగా బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు. పాల్గొనదలచిన వారు రూ.500 ఎంట్రీ ఫీజు చెల్లించి.. వివరాలకు 8367404782, 7661931901 నంబర్లను సంప్రదించాలని కోరారు.

అనుమానాస్పదస్థితిలో వివాహిత మృతి



షేక్ మల్లిక

పెదకాకాని: వివాహిత అనుమానాస్పదస్థితిలో మృతి చెందిన ఘటన నంబూరులో చోటు చేసుకుంది. వివరాలు.. పెదకాకాని మండలం నంబూరు గ్రామానికి చెందిన షేక్ మల్లికకు గతంలో అదే గ్రామానికి చెందిన అక్బర్‌తో వివాహం అయింది. వారికి ఇద్దరు సంతానం. కొంతకాలంగా ఇద్దరి మధ్య మనస్పర్ధలు ఉన్నాయి. తరచూ గొడవలు జరుగుతుండటంతో ఇద్దరూ విడాకులు తీసుకున్నారు. ఆ తరువాత మల్లిక గ్రామంలోని విజయభాస్కర్‌నగర్‌కు చెందిన కారుమూరి ప్రేమ్‌కుమార్‌ను ప్రేమ వివాహం చేసుకుంది. ప్రస్తుతం రెండేళ్ల వయస్సు ఉన్న రూహి అనే పాపను పెంచుకుంటున్నారు. ఎప్పటి మాదిరిగానే శనివారం ఉదయం ప్రేమ్‌కుమార్ సెంట్రింగ్ పనికి వెళ్లాడు. ఇంటికి వచ్చి చూసే సరికి మంచంపై పడి ఉంది. కేకలు వేసినా పలకకపోవడంతో చనిపోయినట్లు భావించి పెదకాకాని పోలీసులకు సమాచారం ఇచ్చాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసుల దర్యాప్తులో వివాహిత మెడపై స్వల్పగాయాలు ఉన్నాయి. గుర్తు తెలియని వ్యక్తులు మల్లిక(29) గొంతు నులిమి హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నారు. సమీపంలో ఉన్న సీసీ కెమెరాల్లో ఇద్దరు వ్యక్తులు ముఖానికి మాస్క్ ధరించి వచ్చినట్లు గుర్తించారు. భర్త ప్రేమ్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పెదకాకాని సీఐ టీపీ నారాయణస్వామి తెలిపారు. మృతదేహాన్ని గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

గ్రామ పంచాయతీల అభివృద్ధిలో కార్యదర్శులు కీలకం

బాపట్ల డీపీఓ కేఎల్ ప్రభాకర్ రావు



మాట్లాడుతున్న జిల్లా పంచాయతీ అధికారి కె.ఎల్.ప్రభాకర్‌రావు

బాపట్ల: గ్రామపంచాయతీలలో మౌలిక వసతులు కల్పనలో పంచాయతీ కార్యదర్శులు కీలకంగా పని చేయాలని బాపట్ల జిల్లా పంచాయతీ అధికారి కేఎల్ ప్రభాకర్ రావు చెప్పారు. శనివారం బాపట్ల ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో జిల్లాలోని 25 మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఈఓపీఆర్డీల సమావేశం నిర్వహించారు. డీపీఓ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పంచాయతీ రాజ్ శాఖలో అనేక ప్రతిష్టాత్మకమైన కార్యక్రమాలు చేపడుతుందని చెప్పారు. స్వర్ణ గ్రామ పంచాయతీ ద్వారా ఇంటి పనులు నీటి పన్నులు జాబితా తాజా పరచటం, చెత్త నుంచి సంపద తయారు చేసే కేంద్రాలను మెరుగుపరచడం, పారిశుద్ధ్య కార్యక్రమాలకి పెద్దపీట వేయాలని వివరించారు. భూముల రీ సర్వే, పల్లె పండుగ పేరుతో పలు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. పంచాయతీలో మౌలిక సదుపాయాల కల్పనే ధ్యేయంగా ముందుకు పోవాలని సూచించారు. పంచాయతీల్లో తాగునీటి సరఫరాపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో చీరాల, బాపట్ల, రేపల్లె డీఎల్పీఓలు శివన్నారాయణ, పులి శరత్ బాబు, నరసింహారావు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

- ఆగిన లారీని ఢీకొట్టిన బైక్..
- మరొకరి పరిస్థితి విషమం



ప్రమాద ప్రాంతంలో క్షతగాత్రుడు

బల్లికురవ: బతుకు దెరువు కోసం తమిళనాడు, అనంతపురం ప్రాంతం నుంచి వలస వచ్చిన గ్రానైట్ కార్మికులు ఆగి ఉన్న లారీని ఢీకొట్టటంతో ఒకరు అక్కడికక్కడే చనిపోయాడు. మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈఘటన శనివారం రాత్రి బల్లికురవ– సంతమాగులూరు ఆర్‌అండ్‌బీ రోడ్డులోని ఈర్లకొండ సమీపంలో చోటుచేసుకుంది. గ్రానైట్ లారీ మరమ్మతులకు గురి అవటంతో రోడ్డు పైనే ఆగింది. స్థానిక గ్రానైట్ క్వారీలో ఫిట్ ఇన్‌చార్జిగా పనిచేస్తున్న తమిళనాడు రాష్ట్రానికి చెందిన వెంకటేష్(35), అదే క్వారీలో ఆపరేటర్‌గా పనిచేస్తున్న అనంతపురం ప్రాంతానికి చెందిన వివేకానందరెడ్డి, బైక్‌పై బల్లికురవ వచ్చి తిరిగి వెళుతూ ఆగిన లారీని ఢీకొట్టటంతో బైక్ నడుపుతున్న వెంకటేష్ అక్కడికక్కడే చనిపోయాడు. వెనుక కూర్చున్న వివేకానందరెడ్డి తీవ్ర గాయాల పాలయ్యాడు. స్థానికులు 108కి సమాచారం అందించడంతో చికిత్స నిమిత్తం చిలకలూరిపేట వైద్యశాలకు తరలించారు.

పోలీస్ లాంఛనాలతో ఏఎస్‌ఐ అంత్యక్రియలు

చీరాల: బాపట్ల పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏఎస్‌ఐగా విధులు నిర్వహిస్తున్న దాసరి కొండయ్య(61) బుధవారం ప్రమాదవశాత్తు మృతి చెందారు. భౌతిక కాయాన్ని శనివారం చీరాలలోని ఆనందపేటలోని ఆయన స్వగృహంలో ఉంచగా చీరాల టూటౌన్ సీఐ నాగభూషణం, బాపట్ల పట్టణ సీఐ అహ్మద్ జానీ, వెల్ఫేర్ ఆర్‌ఐ శ్రీనివాసరెడ్డి, ఇతర పోలీస్ అధికారులు, సహోద్యోగులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మృతికి జిల్లా ఎస్పీ తుషార్ డూడి సంతాపం ప్రకటించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన కుటుంబానికి పోలీస్‌శాఖ అండగా ఉంటుందని, శాఖాపరంగా కుటుంబానికి రావాల్సిన అన్ని రకాల పరిహారాలు, రాయితీలు సకాలంలో అందించేందుకు కృషి చేస్తామని ఎస్పీ తెలిపారు. అధికార లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు.

సివిల్స్ పరీక్షలపై అవగాహన అవసరం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎం.క్యూరి, ఎమ్మెల్సీ లక్ష్మణరావు, యూటీఎఫ్ నాయకులు

గుంటూరు ఎడ్యుకేషన్: సివిల్ సర్వీసెస్‌లో భాగమైన ఐఏఎస్, ఐపీఎస్ తదితర సర్వీసులు భారతదేశంలో అత్యున్నత ఉద్యోగాలని, వాటిని సాధించాలంటే పాఠశాల స్థాయి నుంచే అవగాహన పెంచుకోవాలని ఎం. క్యూరీ పేర్కొన్నారు. యూటీఎఫ్ కార్యాలయంలో కేటీఆర్ ఎడ్యుకేషన్ ట్రస్ట్, స్టూడెంట్ యూనియన్ ఫర్ నేషన్ ఆధ్వర్యంలో 'సివిల్ సర్వీసెస్ – ప్రాథమిక అంశాలు' పుస్తకావిష్కరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సివిల్ సర్వీసెస్ లక్ష్యంగా పెట్టుకుని చదవాలని పేర్కొన్నారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ కె.ఎస్. లక్ష్మణరావు మాట్లాడుతూ డిగ్రీ అర్హతతో సివిల్ సర్వీసెస్ పరీక్ష రాయవచ్చని, పాఠ్యపుస్తకాలతో పాటు పాఠశాల స్థాయి నుంచి న్యూస్ పేపర్స్ చదువుతూ కరెంట్ ఎఫైర్స్ అధ్యయనం చేయాలని చెప్పారు. పరీక్ష ప్రిలిమినరీ, మెయిన్స్, ఇంటర్వ్యూ అనే మూడు దశల్లో ఉంటుందని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంలో కీలకమైన ఉద్యోగులందరూ సివిల్ సర్వీసెస్‌కు ఎంపికైన వారేనని చెప్పారు. సమావేశంలో సన్ అధ్యక్షుడు కె.యశ్వంత్, సాయిరామ్, అహీష్, యూటీఎఫ్ నాయకులు ఎం.కళాధర్, జన్నవిజ్ఞాన వేదిక బి.ప్రసాద్, కె.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఏపీ క్రీడాకారులు అంతర్జాతీయంగా రాణించాలి



తాడేపల్లి రూరల్: ఏపీ క్రీడాకారులు అంతర్జాతీయ స్థాయిలో రాణించాలని శాప్ చైర్మన్ అనిమిని రవినాయుడు అన్నారు. తాడేపల్లి పెనుమాకలో శనివారం 68వ స్టేట్ ఇంటర్ డిస్ట్రిక్ట్ త్రోబాల్ అండర్ 17 బాలబాలికల చాంపియన్‌షిప్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏపీని క్రీడాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడమే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని తెలిపారు. ఏషియన్, ఖేలో, నేషనల్ పోటీల్లో రాణించిన క్రీడాకారులకు రు. 3 లక్షల ప్రోత్సాహకం, నేషనల్స్‌లో రాణించి వారికి యూనిఫాం ఉద్యోగాల్లో డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ కల్పనకు ప్రభుత్వం కసరత్తు చేస్తోందని తెలిపారు. క్రీడల్లో రాణించి ప్రపంచ వ్యాప్తంగా దేశ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేయాలని సూచించారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. కార్యక్రమంలో టీటీడీ బోర్డు తమ్మిశెట్టి జానకీదేవి, తాడేపల్లి మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు పాల్గొన్నారు.